క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ ఫైబర్ గ్రిడ్ పనులు



పనులు చేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: బీఎస్ఎన్ఎల్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో 4జీ సేవలు విస్తృతం చేసేందుకు ఈ ప్రభుత్వ రంగ సంస్థ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా డుంబ్రిగుడ మండల కేంద్రంతో పాటు 18 గ్రామ పంచాయతీల్లో 4జీతో పాటు బీఎస్ఎన్ఎల్ అనుసంధానం ద్వారా ఆయా పంచాయతీ కేంద్రాల్లో ఉన్న సచివాలయంలో హైస్పీడ్ ఇంటర్నెట్, ఫైబర్ గ్రిడ్ సేవలు అందుబాటులో తీసుకురానుంది. పాడేరు- అరకులోయలకు అనుసంధానం చేసే గ్రీన్ కలర్ వైర్ గిరిజన గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ ద్వారా ఇంటర్నెట్‌తో పాటు ఫైబర్ గ్రిడ్ సేవలు అందిస్తుందని, 4జీ సేవలతో ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తుందని కాంట్రాక్టర్ వెంకటనాయుడు చెప్పారు. ఈసందర్భంగా అరకులోయ బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ముద్ద తదితరులు పనులు పర్యవేక్షిస్తున్నారు.

ముఖ గుర్తింపుతోనే రేషన్



ఎఫ్ఆర్ఎఫ్ ప్రక్రియను మొబైల్‌లో నమోదు చేస్తున్న సూపర్‌వైజర్లు

కొయ్యూరు: ముఖ గుర్తింపు ప్రక్రియ (ఎఫ్ఆర్ఎస్-ఫేజ్ రికగ్నైజ్ సిస్టమ్)ద్వారా బాలింతలు, గర్భిణులకు టేక్ హోం రేషన్(టీహెచ్ఆర్) అందజేయాలని సీడీపీవో విజయకుమారి ఆదేశించారు. మండలంలోని బొంకులపాలెంలో ఎఫ్ఆర్ఎస్ ద్వారానే రేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొయ్యూరు ప్రాజెక్టులో 850 మంది బాలింతలు, గర్భిణులు ఉన్నట్టు తెలిసిందన్నారు. ట్రాకర్ యాప్‌లో ఆధార్‌తో అనుసంధానమైన వారి వివరాలు నమోదు చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ మొత్తం ఎఫ్ఆర్ఎస్ డ్రైవ్‌ను చేపట్టామని చెప్పారు. ముందుగా సూపర్‌వైజర్లు సునీత, బాలామణి, మహాలక్ష్మి, భాను, బీపీసీ శేఖర్‌లు గ్రామాలకు వెళ్లి వివరాలు నమోదు చేసినట్టు చెప్పారు.

కార్యాలయాల్లో ప్రత్యేకాధికారి తనిఖీలు



తంటికొండలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి జాన్‌రాజ్

రాజవొమ్మంగి: మండలప్రత్యేకాధికారి జాన్ రాజ్ శుక్రవారం మండలంలోని పలు కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది పనితీరు పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణం త్వరిగ గతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. తంటికొండ పంచాయతీలోని గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్‌సబ్ సెంటర్లను ఆయన సందర్శించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తదితరులున్నారు.

పంచాయతీ విధులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: పంచాయతీ పరిపాలనపై వార్డు సభ్యులు, ఉప సర్పంచ్‌లు అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ బడుగు రమేష్ సూచించారు.రెండు రోజుల పాటు వారికి నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రమేష్ మాట్లాడుతూ పంచాయతీల అధికారాలు, విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీని ద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. సమస్యలపై తీర్మాణాలు, అధికారులకు నివేదించడం తదితర అంశాలను ఆయన సూచించారు. వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, ఎంపీడీవో మేరీరోజ్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- పెదబయలులో డంపింగ్ యార్డ్ లేక అవస్థలు
- పంచాయతీ సేకరించిన చెత్త వారపు సంత స్థలంలో డంపింగ్
- చెత్తకుప్పలతో అధ్వానంగా వీధులు
- దుర్గంధంతో గ్రామస్తులు సతమతం
- పట్టించుకోని అధికారులు



పెదబయిలు వారపు సంత ఆవరణలో చెత్త నిల్వలు

పెదబయలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్యానత ఇస్తున్నట్టు చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. వాస్తవానికి గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దుర్గందంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు పెరిగి రోగాలతో సతమతమవుతున్నారు. అయితే ఉన్నతాధికారులు, యంత్రాంగం పారిశుధ్యంపై కనీస దృష్టి సారించడం లేదు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించింది. అనేక కార్యక్రమాలు చేపడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం(డంపింగ్ యార్డ్)ల నిర్మాణాలకు ప్రణాళిక చేస్తోంది.

ఎక్కడపడితే అక్కడే చెత్త

మండల కేంద్రం సీతగుంట పంచాయతీలో మాత్రం డంపింగ్ యార్డ్ లేక పలు ప్రదేశాల్లో చెత్తను పడేస్తున్నారు. సీతగుంట గ్రామ పంచాయతీ పరిధితో పాటు పెదబయలు ప్రధాన వ్యాపార సముదాయాల రోడ్డు ప్రాంతం, పంచాయతీ గ్రామాల నుంచి ప్లాస్టిక్, పాలిథిన్ ఇతర పలు రకాల వ్యర్థాలు సేకరిస్తున్నారు. రోజుకి రెండు ట్రాక్టర్ లోడుల చెత్త సేకరణ జరుగుతుంది. అయితే వారపు సంత జరిగిన మరుసటి రోజు మూడు లోడ్ల చెత్త సేకరణ జరుగుతుంది. వారానికి 15 లోడ్ల చెత్త సేకరణ జరుగుతుంది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్ లేక పెదబయలు వారపు సంత ఆవరణలోని డిజిటల్ తూనికల కేంద్రం భవనం సమీపంలో చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం చెత్త పెరుకుపోతుంది. ప్రతీ వారం వారపు సంతకు వేలాది మంది వస్తుంటారు. సీజన్‌లో ప్రస్తుతం చెత్త పేరుకుపోయిన ప్రాంతమంతా పిప్పళ్ల మార్కెట్, నాటు కోళ్ల అమ్మకం కోసం మండల రైతులు వినియోగించేవారు అయితే చెత్త పడేస్తుండడంతో సంతకు వచ్చిన ప్రజలు అసౌకర్యంగా గురవుతున్నారు. సంత ప్రాంతంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమివ్వడంతో తీవ్ర దుర్గందం వెదజల్లుతోంది. దీంతో వ్యాపారులతో పాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముక్కుమూసుకొని ఉండాల్సి వస్తోందని పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లర్ల దశకే దంపింగ్‌యార్డు పరిమితం

ఏడేళ్ల క్రితం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశ వరకు పనులు జరిగాయి. అయితే ఆస్పత్రి సమీపంతో పాటు అక్కడే ఆశ్రమ పాఠశాల ఉండడంతో డంపింగ్ యార్డు నిర్మాణంపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో పనులను నిలిపివేశారు. దీంతో ఏళ్ల తరబడి సేకరించిన చెత్తను పలు చోట్ల పడేస్తున్నారు. డంపింగ్ యార్డ్ లేక గ్రామ పంచాయతీ కార్మికులు చెత్తను సంత ఆవరణలో వేస్తున్నారు. దీంతో సంతకు వచ్చే ప్రజలతో పాటుగా పక్కనే ఉన్న పాఠశాల, వసతి గృహం విద్యార్థులు చెత్త వల్ల దుర్గంధంతో సతమతమవుతున్నారు. దోమల ఉధృతితో రోగాలబారిన పడుతున్నామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నాఉ. దుర్గందంతో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనాప్రభుత్వం, ఉన్నతాధికారులు, యంత్రాంగం స్పందించి గ్రామానికి దూరంగా డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించి చెత్తను తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంత ఆవరణలో చెత్తతో ఇబ్బందులు



సీతగుంట పంచాయతీలో డంపింగ్ యార్డ్ లేక పెదబయలులో సేకరించిన చెత్తను పలు చోట్ల వేస్తున్నారు.గత కొన్ని నెలల నుంచి పెదబయలు వారపు సంత ఆవరణలో చెత్తను వేస్తున్నారు.దీంతో సంతకు వచ్చే ప్రజలు, పక్కనే ఉన్న పాఠశాల ఉంది. డంపింగ్ యార్డ్ ఊరికి దూరంగా కేటాయించాలని కోరాం. అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్‌కు స్థలం మంజూరు చేసి, సంతలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– గందేరు జీవన్ కుమార్, వార్డు సభ్యులు. పెదబయలు గ్రామం

డంపింగ్‌యార్డు కోసం నివేదించాం

సీతగుంట పంచాయతీలో డంపింగ్ యార్డ్ నిర్మాణానికి గ్రామానికి దూరంగా స్థలం కేటాయించాలని సూచించారు. డంపింగ్ యార్డ్ లేకపోవడంతో సంత ఆవరణలోనే తాత్కలికంగా చెత్తను డంప్ చేయడం జరుగుతుంది. గ్రామానికి దూరంగా స్థలం కేటాయించి, అక్కడ డంపింగ్ యార్డ్ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

–నర్సింగరావు,ఈవోఆర్‌డీ, మండల పరిషత్, పెదబయలు

ఉపాధి పనులు ప్రారంభం



సొవ్వలో ఫారంపాండ్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బాకా ఈశ్వరి, కూటమి నాయకులు



నుర్మతిలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కళ్యాణి, ఏపీవో కొండబాబు

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వా పంచాయతీ కేంద్రంలోని శుక్రవారం కూటమి పార్టీ నాయకులు, మండల అధికారలతో కలిసి డుంబ్రిగడ ఎంపీపీ బాకా ఈశ్వరి ఫారంఫండ్ కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సర్పంచ్ పొండోయి. సోయిత, కూటమి నాయకులు సుబ్బారావు, స్వామి, నాయకులు సింహాచలం, పొండోయి, అశోకుమార్, ఏపీవో సూరిబాబు, మాజీ సర్పంచ్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో నుర్మతి, బొయితిలి, కిల్లంకోట పంచాయతీల్లో కొత్తపాలాలు, వాకపల్లి, వనుకూరు, కురిడేలు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. పలు నిర్మాణ పనులను ప్రారభించారు. ఎంపీపీ కళ్యాణి, సర్పంచ్‌లు సూరిబాబు, మాలన్న, చిలకమ్మ ఎంపీటీసీ సభ్యుడు లంబూరి అప్పలరాజు, ఏపీవో కొండబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ మత్స్యకొండబాబు, సచివాలయ సిబ్బంది సురేష్, నాయుడు,పంచాయతీ కార్యదర్శి,తదితరలు పాల్గొన్నారు.

రంపచోడవరం: రంపచోడవరంలోని నడివీధి గ్రామంలో ఒలుగుల రాజమ్మ చెరువు తవ్వకం పనులకు శుక్రవారం సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. డ్వామా ఏపీడీ శ్రీనివాస్‌దొర, బాపిరాజు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని కూనవరం, మర్రిగూడెం, కరకగూడెం, వెంకటాయపాలెం, టేకుబాక పంచాయతీల్లో ఫారం పాండు, కొత్త ఊట కుంట, మినీ గోకులం, కొత్తపంట కాలువ పనులకు శుక్రవారం సర్పంచ్‌లు సోందె ముత్తమ్మ, బొల్లి లక్ష్మి, నూపా వెంకన్న బాబు, సోందె రామయ్య, మల్లంపల్లి హేమంత్, కుమార్‌లు భూమి పూజ నిర్వహించారు. ఏపీఓ శ్రీకాంత్, జీపీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కూనవరంలో రోడ్డు పనులకు భూమి పూజ నిర్వహిస్తున్న సర్పంచ్ హేమంత్ కుమార్



నడివీధిలో చెరువు పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ బొజ్జయ్య

జిల్లాకు నిధుల కేటాయింపులో ప్రభుత్వం విఫలం



రామకృష్ణ

గూడెంకొత్తవీధి: రాష్ట్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో అల్లూరి జిల్లాకు తీవ్ర అన్యాయం చేస్తుందని గూడెంకొత్తవీధి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2712.50 కోట్లు కేటాయించగా అల్లూరి జిల్లాకు మొండి చేయి చూపించారన్నారు. గిరిజన జల్లాగా ఉన్న అల్లూరి జిల్లాకు అవసరమైన నిధులు విడుదల చేయకపోవడం గిరిజనుల పట్ల విపక్షత చూపడమేనన్నారు.

విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలని డిమాండ్

అరకులోయ రూరల్: విద్యుత్ అదనపు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ శాఖా కార్యాలయం వద్ద శుక్రవారం నాయకులు నిరసన తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి రామారావు మాట్లాడుతూ వివిధ కారణలతో విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలన ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు రమేష్, రామన్న, నాని బాబు పాల్గొన్నారు.

కొయ్యూరు: ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం కాకరపాడు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మండల సీపీఎం కార్యదర్శి సూరిబాబు, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాట తప్పి ప్రజలను నిలువునా మోసం చేస్తుందన్నారు.

కూనవరం: విద్యుత్‌చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల వినియోగం ప్రతిపాదన విరమించుకోవాలని సీపీఎం కూనవరం, విఆర్ పురం మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు పెంటయ్య, సత్యనారాయణలు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు చార్జీల పేరుతో విద్యుత్‌భారాన్ని ప్రజలపై మోపడం తగదన్నారు. తక్షణం స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీతారామయ్య, జయసుధ, కారం లక్ష్మి, పులి సంతోష్, పంకు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ఒరిగిపోయిన బస్సు

మారేడుమిల్లి : మండలంలోని జీఎం వలస పంచాయతీ పరిధిలోని పాములేరు గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనే బురదలో కుంగిపోయింది. కాకినాడ ,డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భద్రాచలం నుంచి కాకినాడకు ప్రయాణికులతో శుక్రవారం వస్తుండగా పాములేరు గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి పక్కనే బురదలో కుంగిపోయి ఒక పక్కకు ఒరిగింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎటపాక తహసీల్దార్‌గా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ



ఎటపాక: మండల తహసీల్దార్‌గా కారం సుబ్బారావు శుక్రవారం భాద్యతలు చేపట్టారు. ఈయన మారేడుమిల్లి తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఎటపాక వచ్చారు. ఈయన గతంలో ఇదే మండలంలో రెవెన్యూ శాఖలో పనిచేశారు. ఆయనను రెవెన్యూ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నెల్లిపాకలో స్వచ్ఛభారత్



పీహెచ్‌సీ ఆవరణలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

ఎటపాక: నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా పీహెచ్‌సీ ఆవరణలో చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి కూడలిలో మానవహారం చేశారు. డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రత్యూష్,సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఎంగా అప్పారావు బాధ్యతల స్వీకరణ



ఎటపాక : మండల వెలుగు ఏపీఎంగా బి.అప్పారావు శుక్రవారం భాద్యతలు చేపట్టారు. ఈయన రంపచోడవరం మండలం ఏపీఎంగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఏపీఎంను పలువురు కలిసి అభినందనలు తెలిపారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన స్వామి రంపచోడవరం బదిలీపై వెళ్లారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న సీఐ నరసింహమూర్తి, ఎస్ఐ వెంకయ్య

అడ్డతీగల: క్రీడలు యువతలో మానసిక ఉల్లాసంతో పాటు ధేహదారుడ్యాన్ని పెంపొందిస్తాయని అడ్డతీగల సిఐ నరసింహమూర్తి అన్నారు.అడ్డతీగల మండలం దుశ్చర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని డి.రామవరంలో యువతకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శుక్రవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం ఉన్న యువతకు ప్రోత్సాహంగా పోలీస్‌శాఖ ద్వారా తగిన తోడ్పాటు అందిస్తున్నామన్నారు.నైపుణ్యం పెంచుకుని మంచి పేరు సంపాదించుకోవాలన్నారు.యువత క్రీడలతో పాటు మంచి విద్యను నేర్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.మాదక ద్రవ్యాల జోలికి ఏ ఒక్కరూ వెళ్లొద్దన్నారు.గంజాయి మహమ్మారిని దరిచేరనివ్వొద్దన్నారు. గంజాయి సాగు, రవాణా చట్ట ప్రకారం నేరమన్నాన్నారు. గంజాయిపై సమాచారం ఉంటే వెంటనే పోలీసుశాఖకు అందిచాలన్నారు. ఎస్ఐ వెంకయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలకు లైట్లు పంపిణీ



చింతలపూడి ఆశ్రమ పాఠశాలకు ఎల్ఈడీ లైట్లను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని చింతలపూడి గ్రామ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని ఎల్ఈడీ లైట్లు పంపిణీ చేశారు. గురువారం సాయంత్రం ఐదు ఎల్ఈడీ వీధిలైట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతు ఆశ్రమ పాఠశాలల్లో రాత్రివేళ ఎక్కువ లైటింగ్ ఉండాలనే లక్ష్యంతో పాఠశాల ఏర్పాటువేయడానికి ఎంపీపీ నిధులతో ఈ లైట్లు కొనుగోలు చేసి అందజేసినట్టు తెలిపారు. మండలంలోని అన్ని ఆశ్రమ పాఠశాలలకు ఈ లైట్లను త్వరలో అందజేయడానికి సిద్ధం చేశామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, పల్లాల సన్యాసమ్మ, నాయకులు పల్లాల మంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



చింతపల్లిలో స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో, జెడ్పీటీసీ తదితరులు



యార్లగడ్డలో ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో శ్రమదానం



హుకుంపేటలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీవో

వై.రామవరం: పంచాయతీల్లో శుక్రవారం డ్రైడే-ఫ్రైడేలో భాగంగా ఎంపీడీవో కె.బాపన్నదొర పర్యవేక్షణలో, మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శుల ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. యార్లగడ్డ పంచాయతీలో శ్రమదానం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో ప్రతీ శుక్రవారం డ్రైడే-ఫ్రైడేలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది శ్రమదానంతో పరిశుభ్రం చేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యురాలు వీరమళ్ళ సుబలక్ష్మి, సర్పంచ్ పల్లాల పద్మావతి పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీపీ కూడా రాజుబాబు, ఈవో పీఆర్డీ అప్పలరాజు, వైస్ ఎంపీపీ కొండలరావు, సర్పంచ్ పూర్ణిమ తదితరులు స్థానికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. నాయకుడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: తాజంగి, లంబసింగి, లోతుగెడ్డ, పెదబరడ, అన్నవరం పంచాయతీల్లో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఫ్రైడే-డ్రైడే కార్యాక్రమం జరిగింది. ఎంపీడీవో ఆశాజ్యోతి,ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, ఎంఈవో ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, వైస్ సర్పంచ్ నూర్, కో-ఆప్షన్ సభ్యులు నాజర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు ప్రకటించాలి

అరకులోయ రూరల్: రైతుల అభిప్రాయలతోనే కాఫీ ధరలు నిర్ణయించాలని కాఫీ రైతు సంఘం జాతీయ సభ్యుడు గెమ్మెలి చిన్నబాబు తెలిపారు. మండలంలో సుంకరమెట్ట పంచాయతీ బెడ్డగుడ గ్రామంలో ఆయన శుక్రవారం పర్యటించి కాఫీ రైతులతో సమవేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మ్యాక్స్, గిరిజన సహకార సంస్థ(జిసిజి)లు ప్రకటించిన కాఫీ ధరలు కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూర్చే విధంగా ఉందన్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, ఇందుకోసం కాఫీ రైతులతో చర్చించి ధరలు ప్రకటించలన్నారు. బోగస్ సంస్థలతో ప్రభుత్వం, ఐటీడీఏ, జీసీసీ కలిసి రైతులకు నష్టం కలిగిస్తున్నాయన్నారు. పేరుకే అరకు కాఫీ ధరలు మాత్రం అంతంతా మాత్రమే అన్నారు. బకాయి ప్రోత్సహ నిధులు రూ. 60 కోట్లు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు సన్యాసిరావు, రామారావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్

జి.మాడుగుల: మండలంలో మారుమూల భీరం, నుర్మతి, బొయితిలి, కిల్లంకోట పంచాయతీల్లో నిరుద్యోగ యువతను ప్రభుత్వం గుర్తించి వారి విద్యార్హతను బట్టి శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని కరాటే అసోసియేషన్ స్టూడెంట్స్ కుంపుకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ బాకూరు పాండురాజు తెలిపారు. మండలంలో బొయితిలి పంచాయతీ మద్దిగరువు గ్రామంలో శుక్రవారం నాలుగు(భీరం, నుర్మతి, బొయితిలి, కిల్లంకోట)పంచాయతీలకు సంబంధించిన నిరుద్యోగ యువత, గిరిజన ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఈ ప్రాంతం విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో చాలా వెనుకబడి ఉందన్నారు. నాలుగు పంచాయతీల్లో గల గిరిజన గ్రామాల్లో అనేక మంది చదువుకొని ఎటువంటి ఉపాధి లేక నిరుద్యోగులు ఉన్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు ఈ ప్రాంతంపై వివక్షత చూపుతున్నట్టు స్థానిక యువత తమ దృష్టికి తీసుకువచ్చారు. గిరిజన నిరుద్యోగులను జిల్లా అధికారులు, ప్రభుత్వం గుర్తించి వారి విద్యార్హతను బట్టి తగిన శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి మార్గాలు చూపించాలని కోరారు.

బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలి

ముంచంగిపుట్టు: బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి గ్రామంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య, నాయకులతో కలిసి సందర్శించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గృహాలకు బిల్లులు అందడంలేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెప్పారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య మాట్లాడుతూ పీఎం జన్‌మన్ ద్వారా మంజూరైన గృహాలకు సంబంధించిన బిల్లులను వేగంగా లబ్ధిదారుల ఖాతాల్లో త్వరితగతిన జమ చేయాలన్నారు. మండలంలో 202 మందికి పీఎం జన్‌మన్ ద్వారా గృహాలు మంజూరైనా నేటికి ఒక్కరికి కూడా బిల్లులు జమ కాలేకపోవడం దారుణమన్నారు. హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. బిల్లుల మంజూరు కోసం గృహ లబ్ధిదారుడి నుంచి రూ.5వేల నుంచి రూ.10వేలు వరకు అక్రమ వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. త్వరగా బిల్లులు మంజూరు చేయాలని లేని పక్షంలో లబ్ధిదారులతో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి



చింతపల్లి డీఎఫ్‌వో నరసింహారావును కలిసిన ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతపల్లి: చింతపల్లి మండలంలో పర్యటకాభివృద్ధికి అటవీ శాఖ ద్వారా అవసరమైన చర్యలు తీసుకోవాలని చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషాదేవి కోరారు. చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, సర్పంచ్ పుష్పలత, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి తదితరులు ఇటీవల చింతపల్లి డీఎఫ్ఓగా బాధ్యతలు స్వీకరించిన నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలోని పలు సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై వినతిపత్రాలను అందజేశారు.

మేఘాల కనువిందు



సాక్షి, పాడేరు: పాడేరు ప్రాంతంలో శుక్రవారం సూర్యోదయం సమయంలో మూడు రంగుల్లో మేఘాలు చూపరులను కనువిందు చేశాయి. తొలుత నీలిరంగులోను, కొద్ది క్షణాల్లోనే తెలుపు, తరువాత బంగారు రంగులో మేఘాలు దర్శనమిచ్చాయి.